


'ఒక్కడూ రావడంతో తను పొరపాటే చేసేడు' అనుకున్నాడు ఊటీ లాడ్జింగ్స్ మెట్లు దిగుతూ చంద్రశేఖరం. మనాసే జర్‌కి రూముతాళం అందించి ఎదురుగా చూసేసరికి వాల్‌క్లాక్‌లో నాలుగున్నర అయింది.

అతను మెల్లగా హోటల్ వదిలి బయటకు వచ్చాడు.

'ఈ సాయంత్రం ఒంటరిగా ఎలా గడపాలి?' అన్నప్రశ్న మెదడులో ఎదురై అతనికి చిరాకు కలిగించసాగింది. అతను ఎదురుగుగా దృష్టి సారించేడు. వరప్పతీ సెంటరులో నాలుగైదు సినిమాపోస్టర్లు కనుపించాయ్. కాని అవి చూసేక సినిమాకు వెళ్లకూడదనే నిశ్చయించుకున్నాడతను.

ఆలోచనలతో నడుస్తూ అతను కింగ్ జార్జి హాస్పిటల్ సెంటరువరకూ వచ్చేడు. ఒక్కసారి నలువైపులా కలియజూసేసరికి అతనికి అప్పుడు గుర్తువచ్చింది, పేపర్లో తను విశాఖ బీచ్ డెవలప్‌మెంట్ గురించి చదివిన విషయం.

ఈసంధ్య ఆరోడ్డు బాగా విశాలంచేసి—బీచ్‌లో చిల్డ్రన్‌పార్క్, పగోడా మోడల్లో హోమ్సూ కట్టేరట!

అతను మెల్లగా దాను దిగసాగేడు. ఎదురుగా నీలంగా సముద్రం—తనకంటె చాలా దిగువగా గర్వపురేఖలు మనసులో మెదలుతుండగా అతను దౌను పూర్తిగా దిగి బ్యాటరీవద్ద మలుపు తిరిగేడు.

అక్కడ—అతను—చంద్రశేఖరం— అప్రయత్నంగా ఆగిపోయాడు.

అతనికి కొంచందూరంలో అతనికంటె ముందు నడుస్తున్న అమ్మాయి చాలా ఆకర్షణీయంగా ఉంది.

తెల్లగా...సన్నగా... పొడుగ్గా రుతున్న ట్లున్న ఆ శరీరంలో చాలా అందమైన వొంపులు...అతన్ని ఆశ్చర్యపరచసాగేయి. అనుకోకుండానే అతను వేగంగా నడవడం ప్రారంభించి ఆమెనుదాటి కొన్ని అడుగులు ముందుకువెళ్లేక ఒక్కసారి ఆగి వెనక్కి చూసేడు.

ఎంత అందం ఆమెలో !

అప్రతిభుడై నిలబడిపోయాడతను రెప్ప పాటుకూడా మరచిపోయి. ఒక్కసారి... ఆమె...అతనివంక చూసింది.

దృష్టి అలాగే ఆమె నీలికన్నులమీద నిలిపి ధన్యోస్మి అనుకున్నాడు చంద్రశేఖరం.

ఒకే ఒక్క క్షణం.

'మీరు...మీరు...శేఖరం కాదూ?'

దివినుండి భువికి దిగివచ్చిన దేవత తనను పేరుపెట్టి పలకరించడంతో అతను కలా, నిజమా? అన్న భ్రాంతిలో పడి పోయాడు ఈ దేవి నివాసం భూలోకం

కాదు. స్వర్గలోకం...తనన్నడతా 'ఆ లోకాన్ని చూడనైనాలేదు. మరీమెకు తనపై ఎలా యింత కరుణార్ద్ర దృష్టి? ఈ విచిత్రం సంభవమేనా? తను ఆమెకి తెలియడం...

'ఎందుకలా తెల్లబోతారు?' వీణ మ్రోగినట్లు అడిగిందామె.

'మీ అందాన్ని నా కన్నులతో చూడ లేక, మనసులో నిలుపుకోలేక' అందామను కున్నాడతను. కాని అతనికి వాక్కు స్వాధీనంలోలేదు.

'మీరు నాకు తెలుసు..' జాలిపడు తున్నట్లందామె.

'ఎలా? అతి కుతూహలంగా ప్రశ్నించే డతను.

'మీరు కలకత్తాలో ఉండేవారు.'

'మీరూ ఉండేవారా?'

ఓసారి సరదాగా వచ్చేను. అంతే.'

'ఇప్పుడిక్కడ ఉంటున్నారా?'

'ఊఁ. మీరింకా కలకత్తాలోనే అను కుంటాను.'

'అవును... అని ఒక్కసారి నిట్టూర్చి 'మరి...మరి మీపేరు?' అన్నాడతను.

'ఉష !'

మధురంగా వినిపించిన ఆమె పేరుని మళ్లీ మళ్లీ మననం చేసుకున్నాడతను మనస్సులో. అప్పుడనిపించిందతనికి—విశాఖలో యింత అందమైన అమ్మాయి— యింత మంచిపేరుతో ఉండటం ఆంధ్ర దేశానికి గర్వకారణం అని.

చక్కని అమ్మాయీ, యింకా చక్కని పేరూ ఎరోపారనుకున్నాడతను తనలో తానే బయటకు అంటే బాగుండదేమో అన్న బాధతో.

'ఏదైనా పనిమీద వచ్చారా?'

కొంచెం ఆలోచించి అన్నాడతను. 'ఊఁ. మా కంపెనీ బ్రాంచ్ ఒకటిక్కడ ఉంది. దాన్ని పరిశీలించేందుకు వచ్చాను.'

ఆమె రోడ్డుదిగి యిసుకలోకి నడవ సాగింది.

అతను...ఆమె వెనుక.

'నాలుగురోజులుంటారా?'

మీరు ఉండమంటే జీవితాంతమూ ఉండిపోతాను అనుకున్నాడతను. కాని తను అలా మనసుని బహిర్గతం కావించేసుకుంటే వచ్చే పరిణామాలపట్ల కొంచెం అను మానం కలిగి 'లేదు ఉషా! ఇన్స్పెక్షన్ అయిపోయింది. రేపు సాయంత్రం వెళ్లి పోవాలి.' అని ఆమె ముఖంలోకి చూసేడు.

ఆమె అందాన్ని—అతి పల్చని పల్లని మబ్బుపొరలాటివిషాదం రెట్టింపు చేసిం దేమో అనిపించిం దతనికి.

'సారీ!' అన్నాడతను నొచ్చుకున్నట్లు.

ఇంతలో క్వాలిటీస్టాల్‌నుంచి కుర్రాడు ఐస్క్రీమ్ తెచ్చియిచ్చాడు. వాడి చేతుల లోంచి కప్ తను అందుకుని తన చేతు లతో ఆమె కందించాడను.

గులాబీరేకులలాటి పెదవులతో ఆమె ఐస్ క్రీమ్ తినసాగింది.

'ఉషాదేవీ! నన్ను కలకత్తాలో మీరెన్ని సార్లు చూసేరు? ఎక్కడ చూసేరు?' ఆత్రుతగా అడిగాడతను ఐస్క్రీమ్ తినడం ఆపి—ఆమె పెదవులవంక చూస్తూ.

'మూడుసార్లు చూసేను. ఒకసారి బాలీగంజ్ ట్రామ్‌స్టాప్‌వద్ద ఆవేళ మీరు వైట్‌షర్ట్, పొడుం రంగు కాటన్ పాంటూ వేసుకున్నారు.

మరొకసారి థియేటరులో చూసేను.

మూడోసారి...విక్టోరియా మెమోరి యలులో అనుకుంటాను.

అతనికి చాలా గర్వం ముంచుకొచ్చింది, తను అంత అందమైన అమ్మాయి జ్ఞాప కాల్లో అలా నిలచినందుకు.

'థాంక్స్'

'దేనికి?

'నన్ను జాగ్రత్తగా గుర్తుపెట్టుకున్నం దుకూ ... యిప్పుడిలా మంచి కంపెనీ యిస్తుందుకూ.'

'మీరు రేపు నిజంగా వెళ్లిపోవాలా?' ఆ కంఠంలో బాధ — అతని మనసులో ముల్లుగా గుచ్చుకుంది.

'వెళ్లాలి. తప్పదు... ఉషాదేవీ, నేను లేకపోతే కంపెనీ పనులు చాలా తల క్రిందులై నష్టం కలుగుతుంది మరి. సిరిలయిన చెక్ లేకపోతే కంపెనీకి రోజుకే వేలకొద్దీ నష్టమొస్తుంది.'

'ఓహ్! చాలా బాధ్యతకల పని అన్న మాట!'

'నిజమే ఉషా! చాలా బాధ్యత. వయసుకి మించే బాధ్యత. కాని తప్పదు. ఆలీపూర్‌లో ప్లాటూ, కంపెనీ యిచ్చే జీతమూ కావా లంటే, జీవితాన్ని బాధ్యతతో నింపుకోక తప్పదు. ఈ బాధ్యతే నన్ను కలకత్తాతో కట్టిపడేస్తున్నది. అప్పుడప్పుడు అనిపిస్తూ ఉంటుంది— నా జీవితం బాధ్యతకే తప్ప సుఖానికి నోచుకోలేదా అని. ఉదాహరణకి— ఇలా వాల్తేరు రావడం నాకెంత ఆనందంగా ఉందనీ!'

'ఇంకా మీరు పెళ్లిచేసుకోలేదూ?'

'లేదు ఉషాదేవీ!'

'ఎందుకని?'

'తీరిక చిక్కడంలేదు...తరువాత పెళ్లి అనేది కొంచం ఆలోచించి చేసుకోవలసిన పని...'

'నిజమే...మీవంటివారు ముఖ్యమైన పనులు తలపెడితే చాలా ఆలోచించాలి. అందులోనూ కలకత్తా అమ్మాయిలు చాలా గడుసువాళ్లు...అవునా?'

'నోనో...నేనింకా అటువంటి వలలలో చిక్కుకోలేదు ఉషా.' కొంచం కంగారుగా అన్నాడతను. ఉషకి తనమీద ఏవిధమైన దురుద్దేశమూ కలగడం అతని కిష్టంగా లేదు.

'సానీ వలలు పన్ని ఉంచేరా?'

'లక్‌కోర్స్...'

'చిక్కుకునే ఉద్దేశముందా శేఖర్?'

'ఉంది. కానీ వల...మరీ అందంగానూ, బంధించేదిగానూ ఉంటే!' ఒక్కసారాగి చిరు నవ్వు నవ్వి 'క్షమించాలి...మీరు చాలా అందమైనవారు ఉషాదేవీ!'

ఆమె బుగ్గలు సంధ్యారాగంతో మరీ ఎర్రబడ్డాయ్.

ఆమె చటుక్కున తలదించుకుని ఏదో ఆలోచించ సాగింది.

'సారీ ఉషా! పొరపాటు చేశాను.'

'లేదు...'

'నిజంగా నేను పొరపాటు చెయ్యలేదూ?'

'మీరు అనినది పొరపాటే అయితే— అదీ మంచిదే ఒకందుకు...' ఎదురుగా సముద్రం రంగు మార్చుకుంటున్నది.

ఆమె లేచి నిలుచుంది.

'ఓ.! చీకటి పడుతూంది! నడవండి, మిమ్మల్ని యింటివద్ద డ్రాప్‌చేసి వెళ్తాను.'

'నో...థాంక్స్...' అని ఆమె రెండడు గులు వేసింది.

అతనింకా వాళ్ళిద్దరికా విడిపోనట్లే నిలబడి ఉన్నాడు.

ఉష ఎందుకో మళ్ళీ వెక్కి వచ్చింది.

'గుడ్‌నైట్...' అంటూ అతనిచేతిని నొక్కి 'ఒక్కవిషయం చెప్పేదా?' అంది అతని కన్నులలోకి చూస్తూ.

'తప్పకుండా!' అన్నాడతను చాలా ఆశతో ఎదురుచూస్తూ. అవతల చంద్రుడు సముద్రంలోంచి పైకి వస్తున్నాడు ఎర్రగా.

'జీవితాంతమూ గుర్తుంటారు మీరు నాకు...'

'ఎందుకని?' అడిగేడతను.

'రేపు సాయంత్రం స్టేషన్‌లో మీకే తెలుస్తుంది.' అని ఆమె చీకటిలో కలిసి పోయింది అతని మాటలకు చిక్కకుండా.

* * *

అందమైన సాయంత్రం—ఉషతో అని వ్రాసుకున్నాడు చంద్రశేఖర్ తన డైరీలో ఆ రాత్రి.

డైరీ మూసేస్తూంటే ఉత్తరం జారి—బెడ్‌మీద పడింది.

దీపకాంతిలో అతని దృష్టిని ఆ ఉత్తరం బలంగా తనవంక లాక్కుంటున్నది.

అతను బాధగా చూసేడు దానివంక, స్వప్నాలనుంచి వాస్తవాలలోకి రావలసి వస్తున్నట్లు.

ఒక్కసారి...ఉత్తరంమీద కోపమొచ్చింది. ప్రాణంలేని ఆ ఉత్తరాన్ని పగపట్టినట్లు కసిగా నలిపి వేయాలనుకున్నాడు. కాని... మరుక్షణం అతని పొరపాటు అతనికే తెలిసివచ్చింది.

ఉత్తరం వ్రాసింది అన్నయ్య! అమ్మా నాన్నా ఎరుగని తనను ఒంటానాడీ మాత్రం ప్రయోజకుణ్ని చేసిన అన్నయ్య! తనమీద అన్నయ్యకు అభిమానమేకాక అధికారం కూడా ఉండటంలో అసహజమేమీలేదు. కాని... అన్నయ్య... అధికారం ప్రదర్శించడంలో కూడా చాలా తెలివిగా ప్రవర్తిస్తాడు. చంద్రశేఖరం యథాతథ దృష్టితో ఉత్తరం వంక మరల్చేడు.

చిరంజీవి శేఖర్!

మీ వొదినా, నేనూ, పిల్లలూ అంతా క్షేమం. శశిరేఖను చూసుకుందుకు నిన్ను పంపమని వాళ్ళు మళ్ళీ వ్రాసేరు. నీ ఉద్యోగాలు నీకుండటం తప్పేమీకాదు కానీ కొంచం వాస్తవం పరిశీలించడం తెలివైన పని ఔతుంది. జీవితంలో మంచి అవకాశాలు చాలా అరుదుగా మాత్రమే వస్తాయని నా అనుభవాలు నాకు నేర్పిన పాఠం. కనీసం నా పాఠం నిన్నైనా సుఖపెట్టగలిగితే అది నాకు చాలా ఆనందించవలసిన విషయం.

శశిరేఖను నేను చూసేను. నా కంటికి అందంగా కనిపించింది. ఆమె వెనుక వచ్చే ఆస్తి, వారితో ఉండే అతి దూరపు బంధుత్వమూ—అన్నిటినీ మనసు నుంచి దూరంగా తొలగించి చూసినా ఆమె అందంగానే కనిపించింది. ఒక్కసారి నువ్వో ఆమెని చూడు. స్త్రీ యూనివర్సిటీ సాస్టైంపో. అందమూ ఆస్తీ అధికంగానే ఉన్నాయి. నిజం మాటిగా చెప్పాలంటే—కలలో కూడా మనం ఆశించలేని అదృష్టం.

ఒకటి నేనూ అంగీకరిస్తాను. ఆదర్శాల కోణంలోంచి చూస్తే యిదంతా చాలా అన్యాయంగా కనుపించవచ్చు. కాని జీవితాన్ని ఉద్ధరించుకోనీయని ఆదర్శాలతో అర్థం కనుపించడం మానేసింది నా కేనాడో.

నీ జీతంతో వాల్తేరు ప్రయాణం ఎంత అసాధ్యమో నాకు తెలుసు. అందుకే వందరూపాయలు పంపుతున్నాను.

పరిస్థితుల కనుగుణంగా కర్తవ్యం నిర్ణయించుకో.

శశిని చేసుకుంటే నువ్వు సుఖపడగలవన్న ఆశ మీ వదినకీ ఉందని రాయమంది.

పిల్లలు కూడా రాబోయే పిన్నికోసం ఆత్రంతగా ఉన్నారు.

గ్రహించు,
అన్నయ్య.

ఉత్తరం ముడిచేసరికి చంద్రశేఖర్ కన్నులు భారమయ్యాయి. ఆ ఉత్తరంలో... తనూ...తన జీవితమూ తన భవిష్యత్తూ అన్నీ నిర్మొహమాటంగా యధాతథంగా తన ముందు ప్రత్యక్షమయ్యా యనిపించింది. అంతేకాదు, తను తీసుకోవలసిన నిర్ణయం కూడా ఆ ఉత్తరంలో స్పష్టంగా లిఖించబడే ఉందనీ అర్థమైంది.

'ఏమైనా సరే...శశిరేఖనే చేసుకుంటానన్నయ్యా వాళ్ళంగీకరిస్తే' అనుకుంటూ అతను దీపం ఆర్పివేశాడు.

ఆ అద్దెగదిలో అంధకారం ఆవరించింది. ఆ చీకటిలోనకా అతనికి జీవితపు యదార్థ దృశ్యమే కనుపించ సాగించి.

ఇంతవరకూ తనుచూడని శశిరేఖ స్పష్టమైన రూపంతో కన్నుల కెదురుగా కనపడ సాగింది. అంతలోనే... ఉష !—పాలుకారే వొళ్ళూ... గులాబిరేకుల పెదవులూ—కల ఉష కలలోకి మళ్ళా...కాని ఎందుకో ఆ అందమంతా క్షణక్షణానికి అస్పష్టమౌతూ వాస్తవంలాంటి చీకటిలోకి కరిగిపోతున్నది క్రమక్రమంగా.

ఉష ! కల...కథ...అనుకుంటూ అతను నిద్రకు ఉపక్రమించ సాగేడు.

రెండవ అంతస్థులోని గోడగడియారం జోలపాటలా పదిగంటలు కొట్టింది.

* * *

'అతనితో నువ్వేమీ సుఖపడలేవు శశీ! నాకు తెలుసు నీది ఎంత మెత్తని మనస్సో!' అంది ఉష టేబుల్‌లైటు కాంతిలో చంద్రశేఖర్ ఫొటోలోకి వివరంగా చూస్తున్న శశిరేఖతో.

'—నిజంగానా ఉషా ?'

ఉష చటుక్కున తలదించుకుంది. తన ముఖం వ్యక్తంచేసే భావాలలో తను శశిరేఖకి దొరకిపోతుందేమో అన్నట్లు భయంతో

'జరిగినదంతా చెప్పేనుగా? ఇక నువ్వే ఆలోచించుకో.

నీ తత్వానికి సరిపడే మనిషి కాదేమో అని నా అనుమానం!'

'పెళ్ళి ఎప్పుడూ లాటరీయే ఉషా మన పద్ధతుల్లో. ఈ సాయంత్రం చాలా అనుకోకుండా అతను నీకు తటస్థపడటమూ తద్వారా కొన్ని నిజాలు బయటపడటమూ జరిగింది. కాని—

ముందుగా అతని ఫొటో మనకు చేరడం కాని, ఈ సాయంత్రం నువ్వు మీ స్నేహితురాలి యింటికి వెళ్ళడమూ తిరిగి వస్తూ అతన్ని కలుసుకోవడమూ—ఇలా రెండింటిలో ఏ ఒక్కటి జరగకపోయినా నా నిర్ణయం ఎలా ఉండి ఉండేది?' కజిన్ వంక సూటిగా చూస్తూ అడిగింది శశిరేఖ.

'నిజమే..కాని మనం ఆ అజ్ఞానంలో

# కల కరిగిపోయింది

లేదు. పరిస్థితి సర్వమూ మనకు తెలుసు. అందుచేత నీ నిర్ణయాన్ని మరోకసారి ఆలోచించుకోడం అన్ని విధాలా మంచిది కాదూ?'

'కాదనను. కాని డాడీ పరిస్థితి? బ్లడ్ ప్రెషర్ మళ్ళీ ఎక్కువౌతుంది ఈ విషయం వింటే. ఉషా! నువ్వి సంగతి ఆయనకు చెప్పకేం?'

'చిన్నాన్న మీద నాకూ చాలా అభిమాన ముంది శశీ! ఆయన ఆరోగ్యం నాకూ ముఖ్యమే.'

'థాంక్స్ ఉషా! నేను తెల్లవారేలోగా ఏదో ఒక నిశ్చయానికి వస్తాను.'

'అలాగే శశీ! మన శాఖలో అబ్బాయిలు దొరకడం కష్టమని కానీ, డాడీ బాధ పడతాడని ఆట్టే ఆలోచించకు. ముందు నీ భవిష్యత్తు ముఖ్యం. తర్వాతనే మరేదయినా.'

'ఉషా!' ఆశ్చర్యంగా చూసింది శశిరేఖ.

ఉష ఎందుకిలా తనను పూర్వపు నిర్ణయం నుంచి వ్యతిరేక దిశవంక లాగుతూంది?

'నీ నిర్ణయాల ప్రభావంనుంచి కూడా దూరంగానే ఉండి స్పష్టంగా ఆలోచించ దలుచుకున్నాను.'

'అది మంచి పనే శశీ! అయినా ఒక్క మాట చెప్పాలి నీకు—నీకంటె నేను కొంచెం పెద్దదాన్ని కనుక.'

'ఏమిటది?'

'ఆడది సంపెంగే. కాని... మగవాడు తుమ్మెద కావడం భరించలేదు. వాస్తవంలో జీవితాలు సుదీర్ఘాలు. సమస్యలూ, బాధలూ ఆట్టేకాలం కళాత్మకంగా నిలచిపోవు. ఈనాటి తీయటి బాధలు రేపటికి బాగా చేదుగా అయిపోతాయ్. అందుకని...'

'ప్లీస్...ఉషా, నువ్వెళ్ళి పడుకో...గుడ్ నైట్...'

ఒక్కసారి అతి పరిశీలనగా ఆమె ముఖంలోకి చూసి తన గదిలోకి వెళ్ళిపోయింది ఉష.

అప్పుడనుకుంది శశిరేఖ. 'ఉషా! ఈ నాటకంలో ఎదుటి పాత్ర గురించిన వివరాలన్నీ నీకు తెలియవు.' అని.

టేబుల్ లైట్ తీసేసి డిమ్ లైట్ వేసుకుంది శశిరేఖ.

ఆమె మెదడులోకి ఒక్కొక్క ఆలోచనా తరంగమే వచ్చి చితికి పోతూంది.

శేఖర్... ఉష. ఇద్దరూ ఎందుకిలా ప్రవర్తించేరు?

ముఖ్యంగా ఉష ఉద్దేశ మేమిటి?

కొన్ని నిముషాల అనంతరం ఆమె మెల్లిగా మంచం దిగి—ఉష గది వంక నడచింది.

ఉషని ఆ పరిస్థితిలో చూసేక ఆమె ఆశ్చర్యానికి అవధులు లేవు. ఉష సూట్‌కేసులో బట్టలు సర్దుకుంటూంది.

ఇంత హఠాత్తుగా ఆమె ప్రయాణం—ఎక్కడికి? ఎందుకు! ఏం జరిగింది? ఇంకా వెకేషన్ పూర్తి కాలేదుగా?

శశిరేఖ తిరిగి తనగదికి వచ్చి పడుకుంది.

* * *

ఈ నాటకం నేనాడలేను! బాధగా అనుకుంది ఉష.

ఈ సమయంలో తను ముందుగా...ఏమీ మంచిదికాదు. ఈ పరిస్థితిని తను ఏ మాత్రమూ ఎదుర్కోలేదు. అది నిజం.

'బి, స్పోర్టివ్' హెచ్చరించింది శశిరేఖ.

మర్నాడుక్షణంలో...

గ్రేకలర్ సూటు...రెడ్‌స్పాట్ టై...అఖబాసిడర్ షూతో అతను చాలా హుందాగా ఆ గదిలో అడుగుపెట్టి...

'గుడ్‌మార్నింగ్...' అన్న ఆమె విష్‌తో అక్కడే నిలబడిపోయి అప్రతిభుడై ఆమె వంక చూసేడు.

అతని ఎదురుగా ఉష!

'మీ...రా!...?' తడి ఆరిన గొంతుకతో రెండు నిముషాలు చాలా భారంగా గడిచినపిమ్మట ఎలాగో అన్నాడతను.

ఆమె ఏమీ అనలేదు. కాటుకరేఖల కన్నులలో కించిత్ చలనం కలిగి మళ్ళీ ఆగిపోయిందది.

'మీరు...ఇక్కడ...' అతను మరోసారి ఆత్మపరిశీలన కావించుకున్నాడు. తను సరయిన చోటుకే వచ్చాడా?

'ఏం? నేనిక్కడ ఉండకూడదా?'

అతను మూగపోయి చూసేడామెవంక.

'అసలు,..మీరిలా వచ్చేరేం?'

ఇంకా అతనినోరు విడలేదు.

సమీపంలో ఎవరో మృదువుగా నవ్విన శబ్దం—సున్నితంగా.

అతను ఆవంక చూసేడు.

సిల్కుతెర కవతల—లీలగా అస్పష్టంగా ఎవరిలో కదలికలు!

హఠాత్తుగా తేరుకున్నాడతను.

'నేను వెళ్తున్నాను..పొరపాటు జరిగింది.'

'ప్లీజ్...ఆగండి..అసలేం జరిగింది?'

'మీపేరు శశిరేఖ కాదా ఉషాదేవి?'

ఒక్కసారి ఆమె కొంచెం గట్టిగా నవ్వి...'నేను ఉషని శేఖర్....ఏ లోకంలో ఉన్నారు మీరు?' అంది.

ఈసారతను దృఢంగా ఒకనిశ్చయానికి వచ్చేశాడు.

ఏదో నాటకం జరుగుతున్నది! ఎటొచ్చీ ప్రేక్షకురాలు ఒక్కతే సిల్కు తెరకవతల ఉండిపోయింది. ఎదుటి పాత్రధారి పేరు కూడా తెలియని అయోమయంలో ఉండిపోయాడుతను!

ఇది నిజంగా చాలా దారుణం!

'శశిరేఖ ఎవరు శేఖర్?'

నాకు తెలియదు...'

'సస్పెన్స్ చాలుకానీ...అసలుకథ చెప్పండి.'

ఇక తప్పలేదు అతనికి. చిట్టచివరి ప్రయత్నం కూడా చేసి తప్పు ఈ నాటకం నుంచి నిష్క్రమించ కూడదనే నిర్ణయించుకున్నాడతను.

ఎటొచ్చీ దిక్కంతా తను నిజాన్ని ప్రదర్శించాలి!

'మీరు క్షమిస్తానంటే కథలాటి నిజం చెప్తాను...'

'అలాగే..అభినందిస్తాను...'

అతను ప్రారంభించేడు తనపాత్ర పోషణ.

'నిన్న సాయంత్రం బీచ్‌లో నేను మీకు అన్నీ అబద్ధాలే చెప్పాను...'

'.. ... ...'

నేను కలకత్తాలో కంపెనీ మానేజర్ని కాను. కేవలం గుమాస్తాని...'

'... ... ...'

'అలీపూర్‌లో నాకు ప్లాటులేదు ఇద్దరం కలిసి ఓచిన్న మురికికూపంలో ఉంటున్నాం..'

'... ... ...'

'నేను చాలా పేదవాడిని...ఈ బట్టలూ, జోళ్ళూ అన్నీ అద్దెకు తెచ్చుకున్నవే!'

'... ... ...'

'కలకత్తాలో నేను జీవించడంలేదు. చావలేక బ్రతుకుతున్నాను..'

మనస్సుని నిగ్రహంగా అదుపులో పెట్టుకోలేక ఆవేశంగా అన్ని నిజాలూ బయట పెట్టేసుకున్నాడు శేఖర్.

తెరవెనుక శశిరేఖ 'ఈ నిజాలు నీకలా తెలియవు ఉషా!' అనుకుంది వీళ్ళని వీళ్ళ మాటలని వింటూ.

'మరెందుకిలా నాటకం ఆడేరు?'

'శశిరేఖ అనే అందమైన, ధనవంతుల అమ్మాయిని చూడటానికొచ్చాను...అవును...ఆమె డబ్బుపై చాలా ఆశతో.'

'మరి?'

'సాయంత్రం మీరు నన్ను పేరు పెట్టి పిలవడంతో, ఒక్కక్షణం తియ్యని వూహాలు రేగి—ఆ వూహల కోక స్థిరరూపం ఇచ్చి మనసులో నిలుపుకోవాలనే దురాశతో మీకన్నీ అబద్ధాలు చెప్పేను. కాని—నిన్న సాయంత్రం కొంచెంసేపు అందంగా గడుప గలిగినందుకు కొంచెం గర్వపడ్డా, ఇప్పుడు చాలా పశ్చాత్తాప పడుతున్నాను.'

'ఎందుకనా?'

'మనసుని మోసం చేసుకుంటే తప్ప నాకు జీవితం గడవదు. నిజంగా నాకు కేవలం అందమే కాదు కావలసింది! అన్నీ కూడా రావాలి. అందుకే శశిరేఖని చూడక మునుపే పెళ్ళికి అంగీకరించడానికి సిద్ధమయ్యాను. అయినా లాంఛనం కోసం ఇలా వచ్చేను. నిన్న సాయంత్రం నేను నాటకం ఆడానని మనస్ఫూర్తిగా అంగీకరిస్తున్నాను. ప్లీజ్... ఇప్పుడైనా నిజం చెప్పండి. శశిరేఖ ఎవరు? మీరేనా?' ఆమె కర్చీఫ్‌తో కన్ను లద్దుకుని అంది. 'నేను ఉషనే. ఉషాదేవిని...శశిరేఖ... శశీ!' అని పిలిచింది.

కర్టెన్ తొలగించుకుని మెల్లగా వచ్చింది శశిరేఖ.

కాని శేఖర్ ఆమెని చూడలేదు.

'శెలవివ్వండి... నేను వెళ్తాను.'

'మీరు వచ్చిన పని కాలేదు.'

'ఆ పని కాకపోదు. శశిరేఖని అన్యాయం చెయ్యడం నా కిష్టంలేదు. ఆమెకు నేను అన్నివిధాలా అనర్హుణ్ణి.'

'ఆ విషయం నిర్ణయించాల్సింది మీరు కాదు.'

'నేను కదూ?' అంటూ శేఖర్‌కి ఎదురుగా వచ్చి నిలుచుంది శశిరేఖ. శేఖరం ఆమెను చూడలేనట్టు తల వంచుకున్నాడు.

'ఈ కాలంలో ఆడపిల్లలే తల వంచు కోర్చు. అంతగా అయితే ఆ పని చెయ్య



కలిసింది నేను.'

'నేను నేరం చేశాను.' గొణుక్కున్నా డతను తనతో తానే.

జరగబోయే దేమిటో తనకు తెలుసును.

తనలాంటి అబద్ధాల మనిషిని—వ్యాసర చెల్లిని—శశిరేఖ ఎంతమాత్రమూ అంగీక రించదు. కొద్ది క్షణాల్లో అన్నయ్య ఆశలూ, తన భవిష్యత్తూ అన్నీ సమూ లంగా నాశనమౌతాయ్. తనని హేళన చేస్తూ అదృష్టం దూరంగా పారిపోతుంది. ఆక్షణా నికి సిద్ధం కావాలి తను.

నేరం చేస్తే చేశారు గానీ శిక్షకు సిద్ధ పడండి.'

# కల కరిగిపోయింది

అతను ఆలోచనలు కట్టిపెట్టి తల ఎత్తి చూసేడు.

'ఉష అంత అందగత్తెను కాను. అందు లోనా పబ్లిగ్గా బీచ్‌లో ప్రేమ ఘట్టా లలో పాల్గొనగలిగే చొరవా లేదు నాలో.'

'...'

'ఒక్కసారి నన్ను నిలువునా చూసి చెప్పండి, మీ కళ్లు నే నందమైనదాన్ని అని అంగీకరిస్తాయో లేదో?'

తుళ్లి పడ్డాడు శేఖర్.

ఇంకా ఎంత సేపీ నాటకం? అందులోనూ తనిలా నేరస్థుడిలా నిలబడటం మరీ బాధగా ఉంది కూడా!

అతను ఒక్క అడుగు ముందుకి వేయ బోయాడు.

ఈసారి శశిరేఖ అతని చెయ్యిపట్టుకుని ఆపింది.

'నాకు నాటకాలు జన్మతః అలవాటను కున్నాను. కాని...ప్చ్...భయపడుతున్నారు. బొత్తిగా'

'... ... ...'

'ఒక్కమాట చెప్పేస్తే మిమ్మల్ని క్షమిం చేస్తాను పూర్తిగా...'

'ఏమిటది?' ఎలాగో ఆమె ముఖంలోకి చూడగలిగే డతను.

'అబద్ధాలు చాలా తియ్యగా ఉంటాయి, నిజాలలాగా కాకుండా.

అవునా?'

'ఊఁ'

'నాటకాలుకూడా చాలా బావుంటాయ్ వాస్తవాలకంటే! అవునా?'

'ఏమిటీ ప్రశ్నలు?'

'వీటికి సమాధానా లివ్వకపోతే మీగురించి నాకు తెలిసేదెలా?'

ఈ అరవయ్యేడులో ఆ వక్కాయి ఆ కానమాత్రం అధికారమేనా లేదా?'

'ఎప్పుడూ నాటకాలే అయితే అవి బాగుం డవు. అప్పుడప్పుడైతేనే.'

'నిజంగా?' ఆమె కొంచం వెనక్కు వెళ్లి అతనికళ్లల్లోకి చాలా సూటిగా చూపింది.

'అంతే.'

'గుడ్...'

మెరుపుతీగలా పరుగెత్తింది శశిరేఖ యింట్లోకి.

రెండుగదుల అవతల ఆమె కంఠం!

'నిజంగా డాడీ, శేఖర్ భలేమనిషి...నేను తమాషా అమ్మాయినంటావుకానీ, అతనింకా చాలా తమాషా అబ్బాయి తెలుసా? ఇంకా, అతనికేం, నాలాగా అబద్ధాలాడటం కూడా వొచ్చు...మంచియాక్టరు డాడీ!'

ఆగదిలో 'ఏకాంతాన్ననుభవిస్తున్న శేఖరం ఉష ఆగమనంతో సర్దుకుని— 'నాటకం సుఖాంతం...' అన్నాడు చిరునవ్వు నవ్వుతూ.

ఉష ఒక్కసారతని వంక చూలా పీడి.



యుస్గా చూసి.. 'దుఃఖాంతమే! కాని మీకెవరికీ అర్థంకాదు.' అంది.

'ఉషా!'

'మీకేమీ తెలియదు...అబద్ధాలాడటం, నాటకాల్లో నటించడం తప్ప...మీకు నిజా లర్థంకావు.'

'సూటిగా చెప్పండి ఉషా!'

'సాయంత్రం నేను స్టేషన్‌కి రాను—

'ప్లీజ్...ఉషా...అసలు నిజం...'

'మీరూ నేను ఉత్తర దక్షిణ ధ్రువాలం. మీకు నిజాల్లో అబద్ధాలు కావాలి... నాకు...అబద్ధాల్లో నిజాలు కావాలి కాని.... నేనే ఓడిపోయాను...'

ముఖం రెండు చేతులతోనూ కప్పుకుని అక్కడినుంచి బయటకు వెళ్ళిపోయింది ఉష.

శేఖరం యింకా అలాగే నిలబడిపోయాడు.

ఉషకి కావలసిన నిజం ఏమిటి ?

తనగదిలో పెట్టెలో సర్దిన బట్టలను మళ్ళీ హేంగర్స్‌కి తగిలించ సాగింది ఉష.

ఇంతలో శశిరేఖ అక్కడికి వచ్చి... 'ఉషా! శేఖరం వెళ్ళున్నాడు.' అంది ఆమె వంక చూస్తూ.

ఉష ఆమెవంక తిరగకుండానే ' అభి నందనలు శశీ!'

గుడ్‌లక్!.. అంది.

శశిరేఖ ఆమెకెదురుగా వచ్చి....'ఉషా! ఏమిటిది?'

'ఎందుకీ కన్నీరు?' అంది ఆత్రుతగా.

ఇక ఉషకూడా తన బాధను లోలోన దాచుకుందుకు అశక్తురాలై...' 'వద్దు శశీ బాధపడతావు...'అన్నది మెల్లిగా.

'ప్లీజ్...చెప్పవూ?'

'అన్నివిధాలా ఉన్నతురాలివైన నువ్వు శేఖర్‌ని నిరాకరిస్తా వనుకున్నాను....అందుకే కొన్ని గంటలపాటు నా ఆశలలో అతన్ని నిలుపుకున్నాను. కాని – ఆశాభంగమైంది.'

'ఉషా!'

'సారీ శశీ! నా ఉద్దేశం—నన్ను నాకోసం పడే బాధనుంచి తప్పించాలని! కాని... యింకెందుకులే అవన్నీ....నువ్వు కాదు— శేఖరం చాలా అదృష్టవంతుడు.' బలవం తంగా నవ్వింది ఉష. ●



కే. టి. కృష్ణమూర్తి ఆచార్యారిగారి

"మేల్ మాయిల్ మందు"

నల్లరంగు, యెర్రరంగు పొడలు, దద్దుర్లు, గజ్జి, మరియు చెడ్డనీరు వ్యాపించినందున ఏర్పడు వినుగు పుట్టించు రణములు మొదలగు:

దీర్ఘకాల చర్మరోగములకు ఉత్తమ నివారిణి

వివరములకు

సిద్ధ డాక్టర్ కే. టి. కృష్ణమూర్తి ఆచార్యారి & సన్సు

5/22, మేల్‌మాయిల్, (P. O.) N. A. Dt.



మీ చర్మ సౌందర్యమునకు




నిర్మల

ఆయుర్వేదిక్ సోప్పు

వాడండి

Mfrs: NIRMALA CHEMICALS, Cochin 2.

Agents: M/S PRAGATI AGENCIES, VIJAYAWADA-1 (Phone: 5486)



మీ అందమైన కేశములకు

రక్షణ. పోషణ. అవసరం



బెంగాల్

కెమికల్స్

కాంథర్‌డైన్

హేర్ ఆయిల్

పుష్కలముగా

కేశములను పెంచును

రాలటం మాన్పును

బెంగాల్ కెమికల్